ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

## (చించినాడలో శ్రీనాన్నగారి ప్రవచనము, 17-2-96, శివరాత్రి)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అసలు తత్వమునకు నామము లేదు, రూపములేదు. నామరూపములలో కూరుకొనిపోయిన మనకు నామరూపములు లేని తత్వం తెలియటంలేదు. అందువలన ఆ తత్వమే రూపం ధరించి వస్తోంది. దేవుడు మౌనంలో ఉన్నాడు, మాటలలో లేడు. భగవంతుడు మౌనస్వరూపుడే. శరణాగతిపొందినవాడికి మౌనం కుదురుతుంది. ఆ మౌనం నుండి శక్తి కలుగుతుంది. ఉన్నవస్తువు ఒక్కటే. దానికి నామము లేదు. రూపములేదు. మనబుద్ధికి అందటం కోసం ఇలా manifest అవుతున్నాడు. విష్ణువును ఆరాధిస్తే మోక్షం వస్తుందని, శివుడుని ఆరాధిస్తే జ్ఞానం వస్తుందని చెపుతారు. మోక్షం, జ్ఞానం ఒకటే.

చాలామందికి ఇష్టదేవతలు ఉంటారు. తప్పులేదు. కాని ఇతరదేవతల మీద వైరం పెట్టుకోకూడదు, అగౌరవపరచకూడదు. ఇతర దేవతారూపములలోకూడా ఇష్టదేవతనే చూడాలి. ఒక మనిషిని ప్రేమించటం అంటే ఇంకో మనిషితో విరోధం పెట్టుకోమనికాదు.

నేను అందరి హృదయములలో ఉన్నాను అని పరమేశ్వరుడు చెపుతున్నాడుకదా ఆ హృదయం ఎక్కడ ఉంది అని ప్రశ్న. దీనికి భగవాన్ ఎంత స్పష్టంగా చెప్పారు అంటే నీకు నేను అనే తలంపు ఉంది కదా. అది ఎక్కడనుండి పుట్టివస్తోందో అదే హృదయం అని చెప్పారు. అది నీ శరీరములో ఒక భాగము కాదు. పిసినారి తన డబ్బును ఎంత జాగ్రత్తగా కాపాడుకొంటాడో అలాగే నీకు వచ్చే కోరికలను, తలంపులను, సంకల్పాలను లోపల ఉన్న పరమేశ్వరుడు తన దగర జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. రాబోయే జన్మలలో నీచేత అనుభవింపజేయటం కోసం నీలోపల ఉన్న పరమేశ్వరుడు వీటిని జాగ్రత్త పెట్టి ఉంచుతాడు.

వాసనలు అన్నీ హృదయంలో ఉన్నాయి. దేవుడు ఎక్కడ ఉన్నాడు హృదయంలోనే ఉన్నాడు. ఇవి అన్నీ వాడి చేతిలో పెట్టుకొని కూర్చుంటాడు. మీచేత అనుభవింపజేయటంకోసం ఒకోదానిని విడిచిపెడతాడు. హృదయంలో ఉన్నప్పుడు అవి నీకు తెలియవు. వాటిని శిరస్సులోనికి విడిచిపెడతాడు ఈశ్వరుడు అప్పుడు ఈ వాసన ఉంది అని నీకు తెలుస్తుంది. దానిని నీ చేత అనుభవింపజేసిగాని దానిని బయటకు తీయడు. మనకు మంచి తలంపు వచ్చినా, చెడు తలంపు వచ్చినా ఏదో జన్మలో మనచేత సమాధానం చెప్పించిగాని దానిని బయటకు తీయడు. వాడు ఈశ్వరుడు. ఈశ్వరుడిని పరమలోభి అంటున్నారు రమణమహర్షి.

జీవుడుయొక్క మూలం శిరస్సుకాదు. జీవుడియొక్క మూలం హృదయమే. ఎక్కడయితే పరమేశ్వరుడు ఉన్నాను అని చెపుతున్నాడో అక్కడే జీవుడియొక్క మూలం ఉంది. జీవుడు తన మూలమును తను చూసిన వెంటనే అక్కడవాడు నశిస్తాడు. మీలోని జీవలక్షణాలు నశిస్తే వెంటనే మీరు దేవుడు అయిపోతారు.

జీవుడు పుట్టుచోటు హృదయము. జీవుడు విజృంభించేచోటు శిరస్సు. దేవుడు ఉండే హృదయమును, మెదడును కలుపుతూ ఒక అమృతనాడి ఉంటుంది. అయితే మన శరీరమును కోసిచూస్తే అది కనబడదు. సాధనచేయటంవలన, అహంభావన లేకుండా జీవించటంవలన, తపస్సు చేయటంవలన, భగవంతునికి సంబంధించిన పనులు చేయటంవలన ఆ అమృతనాడి open అవుతుంది. అది open అయినపుడు లోపల ఉన్నచల్లదనము, ఆనందము నీకు తెలుస్తాయి. అయితే అమృతనాడి అందరిలోనూ open అవ్వదు.

ఎవడైతే పరిశుద్ధుడో, ఎవడైతే ఏకాగ్ర చిత్తమును సాధించాడో, ఎవడైతే పరమపవిత్రుడో వాడిలోమాత్రమే అమృతనాడి open అవుతుంది. అరచేతిలో ఉన్నవస్తువు మనకు ఎంత స్పష్టంగా కనబడుతుందో అమృతనాడి open అయినపుడు హృదయంలో ఉన్న వస్తువు అంత స్పష్టంగా వాడికి తెలుస్తుంది. వాడితో దేవుడు ఉన్నాడు అని చెప్పినా, లేడు అని చెప్పినా ఒక్కటే.

మనం ఏది మాట్లాడినా చంటిపిల్లల మాటలక్రింద తీసుకొంటాడు. చంటిపిల్లల మాటలు మనకు ఎలా ఉంటాయో బ్రహ్మానుభవం పొందినవాడి దగ్గర మనమాటలుకూడా అలాగే ఉంటాయి. బ్రహ్మానుభవం పొందినవాడికి దేహంకనబడకపోయినా, ప్రపంచం కనబడకపోయినా తాను ఉంటాను అన్న సంగతి వాడికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. అన్ని జీవలక్షణాలు వాడిని విడిచిపెట్టి వెళ్ళిపోతాయి. మరణభయం వాడికి ఉండదు. మనకు శివబుద్ధి కలిగే వరకూ శవబుద్ధి మనలను విడిచిపెట్టదు. శివజ్ఞానము అంటే ఆత్మజ్ఞానమే. అందరూ శవ వాహకులే అన్నారు. స్మశానానికి శవాన్ని మోసుకొనిపోయేవారిని శవవాహకులు అంటారు. ముక్కులో గాలి తిరుగుతున్నప్పుడు ఎవడి శవాన్ని వాడు మోసుకొంటున్నాడు. ఆ గాలి పోయినపుడు దీనినే నలుగురు మోస్తున్నారు. అందుచేత ప్రతీవాడు శవవాహకుడే. విగ్రహాన్ని ఆరాధించేవారిని కొంతమంది తప్పుపడతారుగాని అందరూ విగ్రహారాధకులే. ఈ శరీరము శవము. దీనిని ఎవరినీ ఏమీ అననివ్వము. చాలా జాగ్రత్తగా చూసుకొంటాము. దీనిని ఆరాధించనివాడు ఎవడు ఉన్నాడు ఈ లోకంలో అన్నారు. అందరూ ఆరాధిస్తున్నారు. ఇదే విగ్రహారాధన అంటే.

మనస్సు నిర్మలం అవ్వాలి, ఏకాగ్రం అవ్వాలి. ఒక అవతారపురుషుని గాని, మహాగురువుని గాని ఉపాసించటంవలన మనస్సు నిర్మలం అవుతుంది. నీ మనస్సు నిర్మలం అవ్వటానికి, ఏకాగ్రం అవ్వటానికి నీవు చేసే ప్రయత్నమే తపస్సు. తపస్సువలన పవిత్రత, ఏకాగ్రత వస్తాయి.

పనిముట్ల సహాయంతో హృదయకేంద్రం ఎక్కడ ఉందో చూడవచ్చునా అని అడుగుతున్నారు. దీనికి పనిముట్లు అవసరం లేదు. అది నీ అనుభవానికి తెలుస్తుంది. అది ఉండటం వలననే తెలియబడుతూ ఉంటుంది. ఎవరైనా వచ్చి మీచేయి తాకితే అది మీకు ఎంత స్పష్టంగా తెలుస్తుందో అంత స్పష్టంగా హృదయం నీకు తెలుస్తూ ఉంటుంది. నేను అనే తలంపు నీకు బయటనుండి రావటం లేదు. నీలోపలనుండే వస్తోంది. నేను అనే తలంపు నీలోపలనుండే వస్తోంది అని స్పష్టంగా తెలిసేటప్పుడు ఇంక పనిముట్లు ఎందుకు? నీకు స్పష్టంగా తెలిసేటప్పుడు Complicate చేసుకొంటావు ఎందుకు? అది నీ లోపలనుండే వస్తోంది కాబట్టి దాని కేంద్రం నీ లోపలే ఉండవలె. ఆ కేంద్రమే హృదయం అంటున్నారు. ఆ కేంద్రమే దేవుడు అంటున్నారు. నీకు నేను అనే తలంపు ఒకటి ఉంది కాబట్టి నీవు చేయాలంటే దానితో ధ్యానం చెయ్యి, విచారణ చెయ్యి. నేను ఉన్నవాడికి పూజ, జపం, ధ్యానం, విచారణ ఇవి అన్నీ. నేను లేనివాడికి ధ్యానం ఏమిటి? విచారణ ఏమిటి? నేను లేనివాడికి ఏ గొడవలేదు.

నీవు ఉన్నావని నీకు తెలుస్తోంది. నీవు ఎక్కడ ఉన్నావు? దేహంలోపల ఉన్నావు. దేహం వచ్చేటప్పటికి మనిషికి దుఃఖము వచ్చేస్తుంది. వాడికి ఎంత డబ్బు ఉన్నా దేహం వచ్చేటప్పటికి దుఃఖం వస్తుంది. కారణం ఏమిటి అంటే దేహం వచ్చినపుడు ఆ దేహముతో తాదాప్యం పొందుతాడు. దేహమునకు పరిమితులు, హద్దులు ఉన్నాయి. ఆ పరిమితులలోనుండి, హద్దులలోనుండి అతివేగముగా దుఃఖము వచ్చి నిన్ను ముంచేస్తుంది. పునర్జన్మ వచ్చింది అంటే ఆ మనిషిని దుఃఖము విడిచిపెట్టదు. కృష్ణుడికి దేహం వచ్చింది. అయినా తాను దేహమాత్రుడను కాదు అన్న సంగతి ఆయనకు తెలుస్తూ ఉంటుంది. అందుచేత ఆయనకు పరిమితులు లేవు. మీలో ఎవరైనా నల్లగా ఉంటే మీరు నల్లగా ఉన్నారు అంటే ఇంక ఆ రాత్రికి నిద్ర పట్టదు. కృష్ణుడిని మీరు నల్లగా ఉన్నారు అన్నా ఆయన శాంతి చెదరదు, ఆనందము చెదరదు. ఎందుచేతనంటే ఆయన దేహమునకు పరిమితమైలేడు. దేహమునకు పరిమితమై ఉన్నప్పుడు దేహం నల్లగా ఉంది అంటే ఆ

దేహముతో ఉన్న తాదాప్యం వలన దుఃఖము వచ్చేస్తుంది.

నేను అనే తలంపు నీకు వస్తోంది. అది దేహం అంతటిలోనుండి వస్తోందా లేక ఏదైనా ఒక స్థానం నుండి వస్తోందా? దేహం అంతటిలో నుండి రావటంలేదు. ఒక స్థానం నుండి వస్తోంది. అది ఏ స్థానం నుండి వస్తోందో అదే దానికి కేంద్రము. దానిని నీవు అంగీకరించాలి.

నీ శరీరము ముసలిది, అయినా నీ అవయవాలు అన్నీ ఏ పరిస్థితిలో ఉన్నా నీకు నేను అనే తలంపులోపల నుండి వస్తోంది. అంటే నీ శరీరము ముసలిది అయినా నేను అనే తలంపు యొక్క కేంద్రం ముసలిది అవ్వటంలేదు. అది దేవుడు ఉన్న స్థానము. ఆ కేంద్రము దేహములో ఒక భాగము కాదు. అది దేహములో ఒక భాగము అయితే నీ శరీరము, అవయవాలు ఎలా ముసలివి అవుతున్నాయో అలాగే ఆ కేంద్రము కూడా ముసలిది అయిపోవాలి. అది నీ శరీరంలో ఒక భాగము కాదు కాబట్టి అది ముసలిది అవ్వటంలేదు. నేను అనే తలంపు యొక్క కేంద్రం నీకు తెలియక పోవచ్చుగాని ఆ కేంద్రము నీవు అంగీకరించే తీరవలె. దానినే మనవారు హృదయం అన్నారు.

కొంతమందికి చైతన్యస్థాయి తక్కువగా ఉంటుంది. కొంతమందికి చైతన్యస్థాయి ఎక్కువగా ఉంటుంది. మనకంటే తక్కువ చైతన్య స్థాయి ఉన్నవారితో సహవాసం చేస్తే మనం చెడిపోతాము. మనకంటే చైతన్యస్థాయి ఎక్కువ ఉన్నవారితో స్నేహం చేస్తే ఆ తేజస్సు మనకు వస్తుంది. బుద్ధి విశాలం ఉన్నవారితో స్నేహం చేస్తే మన సాధనతో సంబంధం లేకుండా ఆ విశాలత్వము మనకు కూడా వచ్చేస్తుంది. ఎవరితో సహవాసం చేస్తే మనలో ఉన్న తేజస్సు, వికాశము అభివృద్ధి అవుతుందో అటువంటి స్నేహాలనే ఎన్నుకోవాలి.

నేను అందరి హృదయములలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. అంటే హృదయం వేరు, భగవంతుడు వేరు అని అర్థం కాదు. హృదయాన్ని స్థూల వస్తువుగా చూడాలని అనుకొంటున్నావు. అందువలన పనిముట్లు ఉంటే తెలుస్తుందా అంటున్నావు. హృదయానికి రూపము లేదు, ఆకారము లేదు. అది సూక్ష్మాతిసూక్ష్మంగా ఉంది. హృదయానికి ఆకారము ఉందేమో, అది స్థూలంగా ఉందేమో అని అనుకొంటున్నావు ఇక్కడే మొట్టమొదటలోనే పొరపాటు చేస్తున్నావు. దానికి ఆకారము లేదు. దానికి ఆకారము లేకపోయినా అది ఉంది. జీవుడు దేహంలో ప్రవేశిస్తే ఆ దేహమునకు పరిమితమై ఉంటాడు. దేవుడు కూడా దేహంలో ప్రవేశిస్తాడు. ప్రవేశించినా ఆ దేహమునకు పరిమితమై ఉండడు. జీవుడు చేసిన తప్పు దేవుడు చేయడు. కృష్ణుడు అర్జునుడితో ఒక మాట చెప్పాడు. నీకూ, నాకూ అనేక పూర్వజన్మలు గడిచిపోయాయి. కాని నీకూ నాకూ ఒకటే తేడా ఆ జన్మలు అన్నీ నాకు తెలుసును, నీకు తెలియవు. తెలియటం, తెలియకపోవటం ఒకటే తేడా గాని శవాలను నీవూ మోసావు, నేనూ మోసాను అన్నాడు.

కృష్ణుడికి ఏక సంతోషమే. జీవితం పొడుగునా నవ్వటమే. మంచివార్త విన్నా సంతోషమే, చెడ్డ వార్త విన్నా సంతోషమే. మనకు ఎప్పుడూ ఏడవటమే పని. పుట్టినపుడు ఏడుపే, బ్రతికున్నప్పుడు ఏడుపే, చనిపోయేటప్పుడూ ఏడుపే. ఎవరి గురించి దుఃఖపడకూడదో వారి గురించి దుఃఖ పడుతున్నాము. వారి గురించి దుఃఖ పడవలసిన పనిలేదు అని తెలియక మనం దుఃఖ పడుతున్నాము అని గీతలో చెప్పాడు. మనకు తెలియటం లేదు అందుకు దుఃఖ పడుతున్నాము. ఆయనకు తెలుస్తోంది గనుక ఆయనకు దుః ఖము లేదు. పుట్టినవాడు చనిపోవటం ఎంత ఖాయమో, చనిపోయినవాడు పుట్టటం కూడా అంతే ఖాయం.

జరాసంధుడు మొదలైనవారు తరుముకొని వచ్చినపుడు కృష్ణుడు పారిపోయాడు. పారిపోయేటప్పుడు కూడా ఆయన నవ్వుతూ పారిపోయాడు. ఎవరైనా ఏమైనా అనుకొంటారేమో అనే సిగ్గు ఆయనకు లేదు. నవ్వుతూ పారిపోయాడు. దీనికి కారణము అక్కడ దేహబుద్ధి లేదు. పారిపోయేది ఎవరు? దేహం పారిపోతోంది. తను ఎవరు? దేవుడు. దేహం యొక్క చలనమును తనమీద ఆరోపించుకోవటంలేదు. దేహ బుద్ధి ఉన్నవాడు

దేహం యొక్క చలనమును తన మీద ఆరోపించుకొంటాడు. దేహబుద్ధి నశించినవాడు దేహం యొక్క చలనమును తన మీద ఆరోపించుకోడు. దేహంతో తాదాప్యం వాడికి ఉండదు. అందువలన జయం వస్తే సంతోషం ఉండదు. అపజయం వస్తే దుఃఖము ఉండదు. వాడు ద్వంద్వాలకు అతీతుడు. అసలు సత్యం ద్వంద్వాలకు అతీతంగా ఉంది. నీ మనస్సుకు చలనం వస్తూ ఉంటే దానికి ద్వైత బుద్దే కారణం. నీ దేహమే దానికి కేంద్రం. నీ మనస్సు చలిస్తూ ఉంటే నీకు దేహబుద్ధి ఉన్నట్లే గుర్తు.

హృదయం నీ ఊహ కాదు, హృదయం నీ తలంపు కాదు. దేహము, ప్రపంచము, భయము, రాగము, ద్వేషము ఇవి అన్నీ తలంపులే. కాని హృదయం తలంపు కాదు. చావు కూడా నిజం కాదు, అది కూడా తలంపే. అందరికి దేహం ఉంది కదా. ఈ దేహం కూడా నిజం కాదు. ఇది కూడా తలంపే. ఎందుచేతనంటే గాఢ నిద్రలో నీకు దేహం ఉన్నా ఉన్నట్లు నీకు తెలియటంలేదు. తలంపు వచ్చాక నీకు తెలుస్తోంది. హృదయం తప్పించి మిగిలినవన్నీ తలంపులే. నీ దుఃఖము, గర్వము ఇవి అన్నీ కూడా తలంపులే. కాని నేను అనే తలంపుకు కేంద్రమైన హృదయం మాత్రం తలంపు కాదు. ఎందుచేతనంటే తలంపులు లేనప్పుడు గాఢ నిద్రలో కూడా అది ఉంది.

గాఢనిద్రలో నీవు ఉన్నావు. గాఢనిద్రలో నీవు హృదయంగానే ఉన్నావు. గాఢనిద్రలో నేను లేను అని ఎవడూ చెప్పడు. కాని నీవు ఏమనుకొంటున్నావు గాఢ నిద్ర నిజంకాదు అనుకొంటున్నావు. మెలుకువ నిజం అనుకొంటున్నావు, నీ శవం నిజం అనుకొంటున్నావు, నువ్వు చావటం నిజం అనుకొంటున్నావు, ఈ లోకం నిజం అనుకొంటున్నావు. ఇది అంతా నిజం లాగ నీకు ఎందుకు కనబడుతోంది అంటే నిజంకాని ఈ నేనును నిజం అనుకొంటున్నావు. ఈ చిన్న తప్పువల్ల ఎన్నో పొరపాట్లు వస్తున్నాయి. మనం చేసినది చిన్న తప్పే కాని పెద్ద శిక్ష పడిపోతోంది. చేసినది రూపాయి దొంగతనం కాని ఉరిశిక్ష వేశారు. నీ హృదయంలో ఉన్న ఆనందము నీకు తెలియటం లేదు అది ఉరిశిక్ష కాకపోతే ఏమిటి? హృదయంలో ఉన్న ఆనందము నీకు తెలియక పోవటమే హత్య. అంటే నిన్ను నీవు హత్య చేసుకొంటున్నావు అన్నమాట.

మనం నిద్ర అబద్ధం అనుకొంటున్నాము, మెలుకువ నిజం అనుకొంటున్నాము. దేవుడు అబద్ధం అనుకొంటున్నాము, ప్రపంచము నిజం అనుకొంటున్నాము. అలా అనుకోవటానికి కారణం ఏమిటి? గాఢ నిద్రలో నీకు నేను అనే బుద్ధి లేదు, మెలుకువ వచ్చాక నీకు నేను అనే బుద్ధి వస్తోంది. అది నిజం కాదు. అది నిజం అయితే గాఢనిద్రలో కూడా అది ఉండాలి. ఈ నేను అనే బుద్ధి వచ్చాక దేహం వస్తోంది, లోకం వస్తోంది, పుణ్యాపాపములు, చావుపుట్టుకలు, మంచి చెడ్డలు అన్నీ వస్తున్నాయి. నేను అనే బుద్ధి సత్యమును అసత్యమువలె, అసత్యమును సత్యమువలె నీకు అనిపింపజేస్తుంది. నిజంకాని దేహమును, నిజంకాని ప్రపంచమును నిజంలాగ నీకు అనిపింపజేసేది దేహగతమైన నేనే.

భగవాన్ సమాధానాలు ఎలాగ ఉంటాయి అంటే ఆయన బరువు ఏమీ మోయడు. చెప్పవలసినది ఏదో చెపుతాడు. ఆ గ్రంథములో ఇలా ఉంది అని కొటేషన్లు చెప్పే అలవాటు ఆయనకు లేదు. అసలే సంసారం బరువు మోయలేక పోతున్నాము, ఇంక పుస్తకాల బరువు ఎందుకు అని ఆయన ఉద్దేశ్యం. డైరెక్టుగా ఆయన అనుభవంలో నుండి తీసి ఇవ్వటమే. ఈ మోతగాళ్ళు అందరూ ఎలాగ ఉంటారు అంటే గాడిద మంచి గంధపు చెక్కలు మోస్తుంది. మంచి గంధం చెక్కలు ఇంత వాసన వస్తున్నాయి కదా అని ఆ వాసనను అది అనుభవించదు. చాలామంది పండితులు అంతే. గాడిద మోస్తున్నట్లు మన దగ్గరకు శాస్త్ర విషయాలను, శ్లోకాలను మోసుకొని వస్తారు. ఆ లోపల ఏమి ఉందీ వారికి తెలియదు, ఆ మాటల విలువ వారికి తెలియదు.

నేను అనే బుద్ధి నీకు బయట నుండి వస్తూ ఉంటే ఇక్కడ నుండి వస్తోంది అని చూపించవచ్చును. కాని అది నీ లోపలనుండే వస్తోంది. లోపల ఒక ఆకారములో నుండి వస్తూ ఉంటే అది పనిముట్లకు

దొరుకుతుంది. అది ఎక్కడ నుండి వస్తోందో ఆ స్థానమునకు ఆకారములేదు. అందువలన అది పనిముట్లకు దొరకదు. దానికి ఆకారములేదు అలాగని అది లేదు అనటానికి వీలు లేదు. కరెంటు మనకళ్ళకు కనబడటంలేదు అలాగని కరెంటు లేదు అంటామా.

మనం మంచిగా మాట్లాడినా, ప్రేమగా మాటాడినా కలహాలు పెట్టేవారు ఉంటారు. మనం సహృదయంతో మాట్లాడినా మన సహృదయాన్ని అర్థం చేసుకొనే స్థితి అక్కడ లేకపోతే అది కలహం క్రింద మారిపోతోంది. కలియుగంలో మనుష్యులు కలహప్రియులు. కొంతమంది మనుష్యులు మాట మొదలు పెడితేనే పోట్లాట క్రింద ఉంటుంది. మాటలో సున్నితత్వం ఉండదు. అందుకు కృష్ణుడు గీతలో వాక్కు తపస్సు నేర్చుకోండి అన్నాడు. మనం ఏదైనా మాట మాట్లాడితే అది ఇతరులకు శాంతిని కలుగజెయ్యాలి. మాటలు హితవుగా ఉండాలి, మితంగా ఉండాలి. సందర్భం లేకుండా మాట్లాడకూడదు. మనకు బ్రహ్మానుభవం కలగటానికి వాక్కు తపస్సు కూడా సహకరిస్తుంది.

నీకు సుఖం లేనపుడు, శాంతి లేనపుడు దేవుడు ఉన్నాడు అంటే ఏమి ఉంది, దేవుడు లేడు అంటే ఏమి ఉంది. అంటే దేవుడితో సంబంధము లేకుండా సూటిగా నీ హృదయంలో ఉన్న శాంతిలోనికి నిన్ను ప్రవేశపెట్టటానికి బుద్ధుడు, భగవాన్ చూసారు. వారు మహిమలకు ప్రాముఖ్యత ఇవ్వలేదు. ఎందుచేతనంటే మనస్సు ఎంత నిజమో మహిమలు కూడా అంతే నిజము. తాడిచెట్టు మాట్లాడుతోంది అంటారు. పోనీ చెట్టు మాట్లాడింది. ఏమిటి విశేషం? దాని వలన మీకు జ్ఞానం వచ్చిందా, మీ దుఃఖము నశించిందా, మీ చైతన్యస్థాయి పెరిగిందా. ఇటువంటి గొడవలు అనవసరము. దీనివలన కలిసివచ్చేది ఏమీ లేదు. ఇవి తాత్కాలికంగా ఆకర్షణకు ఉపయోగపడతాయి గాని నీ మూలంలో అహంవృత్తి నశించకుండా, నీ చైతన్యస్థాయి పెరగకుండా నీవు జ్ఞానివి కాలేవు. మహిమల వలన నీవు జ్ఞానివి కావు. గమ్యమును నీ దృష్టిలో ఉంచి, గమ్యమును నీకు చూపిస్తూ, గమ్యము యొక్క విలువ నీకు చెపుతూ నిన్ను నడిపింపజేయటానికి చూసారు బుద్ధుడు, రమణమహర్షి.

అష్టావక్రుడు జనకమహారాజు సభకు వచ్చాడట. అష్టావక్రుడిని చూడగానే జనకమహారాజు సభలో ఉన్న మంత్రులు అందరూ ఒక్కసారే నవ్వారట అంటే అన్ని వంకరలతో ఉన్నాడట. అప్పుడు అష్టావక్రుడు కూడా నవ్వాడట. జనకమహారాజుకు ఆశ్చర్యం కలిగిందట. వారు నిన్ను చూసి నవ్వారు అనుకో మరి నీవు కూడా నవ్వుతున్నావు ఏమిటి అన్నాడు జనకమహారాజు. అప్పుడు అష్టావక్రుడు జనకమహారాజుతో ఇటువంటి మూర్ఖులను పెట్టుకొని నీవు పరిపాలన ఎలా చేస్తున్నావు అని నాకు నవ్వు వచ్చింది అన్నాడట. వారు శరీరమును చూస్తున్నారు, తత్వమును చూడటంలేదు. వారికి చర్మ దృష్టే తప్ప ఆత్మ దృష్టి లేదు. చర్మ దృష్టి ఉన్నవారు చండాలురు. వారు చూడవలసింది దేహమునా. వారికి జ్ఞానం లేదు అన్న సంగతి తెలుస్తోంది. ఇటువంటి వారిని కూడా పెట్టుకొని పరిపాలన చేయటమా నువ్వు. వారి సలహాలా నీకు అన్నాడట అష్టావక్రుడు.

హృదయంకూడా ఉపాసనకేంద్రం. నీవు హృదయాన్నికూడా ఉపాసన చేయవచ్చు . హృదయాన్ని, ఆత్మని ధ్యానం చేయటం కష్టం. అది అసాధ్యం అని చెప్పటం లేదు గాని కష్టము. నీవు చేయగలిగితే సత్యమును ధ్యానించు, అసలు వస్తువును ధ్యానించు లేకపోతే ఒక అవతార పురుషుడినో, ఒక గురువునో ధ్యానించటం మంచిది అని గీతలో చెప్పాడు. నీవు నామ, రూపములతో కలిసి ఉన్నావు కదా అందువలన నామరూపములతో ఉన్న దేవుని ధ్యానించటం నీకు తేలిక అవుతుంది. దేవుని నామమును స్మరించుకొంటూ, దేవుని రూపమును ధ్యానించుకొంటూ తరించటం ఎటువంటిది అంటే నావలో కూర్చుని నదిని దాటటం వంటిది. ఆత్మని ధ్యానించి తరించటం ఎటువంటిది అంటే నదిని ఈదుకొంటూ ఆవలి వడ్డునకు వెళ్ళటం వంటిది. ఇలాగైనా తరించవచ్చు. అలాగైనా తరించవచ్చు. నావ మీద ప్రయాణం చేయటం కొంత తేలిక

అని రాజగోపాలాచారిగారు చెప్పారు.

మీరు మంచివారిని ధ్యానం చేయగా చేయగా ఆ మంచి మీకు కూడా వచ్చేస్తుంది. మీరు హృదయాన్ని ధ్యానం చేయగా చేయగా ఏదైతే ధ్యానం చేస్తోందో అది కరిగిపోయి హృదయాకారం చెందుతుంది. అప్పుడు నీ దేహం శవం అవ్వదు. నీ దేహం దేవాలయం అవుతుంది. మీరాబాయి కృష్ణుడి నామాన్ని స్మరించింది, కృష్ణుడి రూపాన్ని ఆరాధించింది. మీరాబాయి అనేక కష్టాలు పడింది. నిప్పుమీద చేయి పెడితే ఎంత మంట పెడుతుందో అంత కష్టాన్ని వారి బంధువులు ద్వారా మీరాబాయి పొందింది. అన్ని కష్టాలు పడినప్పటికి మీరాబాయికి అది కష్టం క్రింద అనిపించలేదు. దానికి కారణము కృష్ణుడి సపోర్టు. మీరాబాయి కొంత కాలం మధురలో ఉంది తరువాత ద్వారక వెళ్ళిపోయింది. పూర్వం తెలియక కష్టాలు పెట్టాము. ఇప్పుడు గౌరవంగా చూస్తాము ఇంటికి తిరిగి వచ్చేయమని బంధువులు కబురు పెట్టారట. అప్పుడు మీరాబాయికి ఏ ఇంటికి వెళ్ళాలి అనే ప్రశ్న వచ్చింది. ఈ దేహమునకు సంబంధించిన ఇంటికా లేక నిజమైన ఇంటికి ఆ కృష్ణుడు దగ్గరకు వెళ్ళాలా. ఆ ప్రశ్న వచ్చినపుడు ఆవిడ శరీరముతో సహా ద్వారకా కృష్ణుడిలో ఐక్యమయిపోయింది.

దేవుడిని మనం ప్రేమిస్తున్నాము. ఎలా ప్రేమిస్తున్నాము. దేవుడు మనకంటే వేరుగా ఉన్నాడని ప్రేమిస్తున్నాము. కాని దేవుడు తనకంటే భిన్నంగా లేడు అని రమణమహర్షికి తెలుసు. అలా తెలిసికూడా ఆయన అరుణాచలేశ్వరుడిని ప్రేమించాడు. అదీ నిజమైన ప్రేమ. విష్ణువు యొక్క, బ్రహ్మయొక్క గర్వమును అణచటానికి వచ్చిన క్షేత్రం అరుణాచలం. అంటే ఎవరైతే అరుణాచల, అరుణాచల అని స్మరిస్తున్నారో వారి గర్వాన్ని అణుస్తుంది, అహంభావనను తొలగిస్తుంది.

కొంతమందికి ఇచ్చే అలవాటు ఉండదు. ఫలం ఇవ్వండి, పుష్పం ఇవ్వండి అని కృష్ణుడు చెప్పటం ఎందుకంటే ఇచ్చే గుణం అలవాటు చేయటానికి. ఒక పత్రాన్ని, ఒక పుష్పాన్ని భగవంతునికి ఇవ్వలేనపుడు దేహబుద్ధిని భగవంతునికి ఎలా ఇవ్వగలవు. ఎప్పటికైనా మనం దేహబుద్ధిని విడిచి పెడితేగాని ఆత్మబుద్ధి కలుగదు. ఇవ్వటం అలవాటు చేయటం కోసం, దేహబుద్ధిని నశింపజేయటం కోసం భగవంతుడు అలా అడుగుతున్నాడు. ఫలము, పుష్పము, ధనము ఇవి అన్నీ దేహమునకు బాహ్యంగా ఉన్నాయి. దేహమునకు బాహ్యంగా ఉన్న వస్తువునే విడిచిపెట్టలేనపుడు దేహం లోపల ఉన్న నేనును ఎలా విడిచి పెట్టగలవు. దేహమునకు వేరుగా ఉన్న వస్తువును విడిచి పెట్టటం అలవాటు చేస్తే దేహముతో కలిసి ఉన్న నేనును విడిచి పెట్టగలవని, ఆ స్థాయికి ఎదిగేటట్లు చేయటం కోసం, త్యాగ బుద్ధిని నేర్పటం కోసం అలా చెప్పాడు. గురునానక్ దగ్గరకు పరమలోభి ఒకడు వచ్చాడు. నీవు పరమలోభివి అని గురునానక్ అతనితో అనలేదు. ఆయన దగ్గర ఉన్న గుండుసూదిని అతనికి ఇచ్చి నేను చనిపోయిన తరువాత స్వర్గమునకో, నరకమునకో ఎక్కడికో అక్కడికి వెళతాను గదా నీవు ఈ సూదిని జాగ్రత్తపెట్టి ఉంచి అక్కడకు తీసుకొని వచ్చి ఇయ్యి అని చెప్పారు. ఈ సూదిని అక్కడకు తీసుకొని వచ్చి ఎలా ఇవ్వగలను అన్నాడట. అప్పుడు గురునానక్ వాడితో ఈ సూదినే తీసుకొని వచ్చి ఇవ్వలేను అంటున్నావు మరి ఈ ధనాన్ని అంతా ఎక్కడకు తీసుకొని వెళదామనుకొంటున్నావు అన్నారు. గురునానక్ చెప్పేది ఏమిటి అంటే వాడి ధనాన్ని పాడుచేసుకోమనికాదు. వాడి అంతస్థుకు తగిన త్యాగం, దాన గుణం ఉండాలి అని చెపుతున్నాడు.

(కొంతమంది మనం లేకపోతే ఈ లోకం నడక ఆగిపోతుంది అనుకొంటారు. నీవు పుట్టకముందు ఈ లోకం ఉంది, నీవు చనిపోయిన తరువాత కూడా ఈ లోకం ఉంటుంది. నీవు పుట్టక ముందు ఈ లోకమును ఎవడైతే చూసాడో నీవు చనిపోయిన తరువాత కూడా వాడే ఈ లోకమును చూస్తాడు. వాడు మాత్రం చావులేకుండా ఉంటాడు అంటున్నారు రమణాచార్యులు. నేను లేకపోతే ఇది అంతా ఏమైపోతుంది అనుకొనేది నీ కర్తృత్వబుద్ధి.) B

★